క్లుప్తంగా

లచ్చగూడెంలో గ్రామదేవతల ప్రతిష్ఠ



నీటి బిందెలతో తరలివస్తున్న మహిళలు

ఇల్లెందురూరల్: మండలంలోని లచ్చగూడెం గ్రామంలో గ్రామదేవతల ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం వైభవంగా సాగింది. గ్రామ పొలిమేరలో ముత్యాలమ్మ, గ్రామ నడిబొడ్డున నాభిశిల ప్రతిష్ఠాపన కోసం గ్రామస్తులు రెండు రోజులుగా భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మహిళలు బిందెల్లో నీరు తీసుకొచ్చి విగ్రహాలకు జలాభిషేకం చేశారు. అనంతరం వేదపండితులు శాస్త్రోక్తంగా గ్రామదేవతల ప్రతిష్ఠాపన కొనసాగించారు.

రెవెన్యూ సదస్సులో దరఖాస్తుల వెల్లువ



దరఖాస్తులు పరిశీలిస్తున్న తహసీల్దార్

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్, చల్లసముద్రం గ్రామ పంచాయతీల్లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు రైతుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. అర్హత ఉన్నా గతంలో పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు కాని రైతులు, గతంలో మంజూరైన పట్టాదారు పాస్‌పుస్తకంలో ఉన్న తప్పులను సరిచేయాలని రైతులు తమ దరఖాస్తుల ద్వారా అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న శోభన్‌బాబు

సుజాతనగర్: మండలంలోని పలు విత్తనాల దుకాణాలను టాస్క్‌ఫోర్స్ ఏడీఏ శోభన్‌బాబు సోమవారం తనిఖీ చేశారు. విత్తనాలకు సంబంధించిన అన్ని సర్టిఫికెట్లు, లైసెన్సులను పరిశీలించారు. ఎవరైనా డీలర్లు నిబంధనలు పాటించకపోతే వారి పైన కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ నర్మద, తదితరులు పాల్గొనారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ త్వరగా కోలుకోవాలని వేడుకుంటూ ఇల్లెందు శివాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం కార్యకర్తలు, నేతలతో కలిసి శివాలయానికి వెళ్లిన ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, అనసూర్య, డానియేల్, సైదులు, సాంబమూర్తి, సూర్యం, శ్రీనివాస్, సదానందం, సుదర్శన్, స్వరూప, శ్రీనివాస్, కోటయ్య, నందకిషోర్, ఇమామ్, శ్యాం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

ఇల్లెందు: తుడుందెబ్బ జిల్లా నాయకులు సింగరేణి మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన తాటి రామారావు కుమార్తె మంజీరాకు ఆదివాసీ హెల్ప్‌లైన్ ఆర్థిక సాయం అందించింది. సోమవారం ఇల్లెందులోని హెల్ప్‌లైన్ కార్యాలయంలో రామారావుకు రూ.40 వేలు అందించారు. కబ్బాకుల రవి, కుంజ కృష్ణ, కొడెం కృష్ణ, కల్తీ రాంబాబు, కొర్సా ఆదినారాయణ, గలిగ రాంబాబు, బొర్రా రాంబాబు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. అసంపూర్ణం

- అసౌకర్యాలకు నిలయంగా ఫారెస్టు నేచర్ పార్క్
- కనిపించని తాగునీటి సదుపాయం.. జాడలేని విడిది కేంద్రాలు
- వానొస్తే కొండమీదుగా జాలువారుతున్న బురద, చిత్తడిగా రహదారులు
- రూ.కోటి ఖర్చు చేసినా ఫలితం శూన్యం



సందర్శకులు సేదతీరేందుకు నిర్మించిన పగోడా



(ఇన్‌సెట్) కోరగుట్ట మధ్య భాగంలో నిర్మించిన వాచ్‌టవర్

ఇల్లెందురూరల్: అడుగుపెట్టిన చోటు నుంచి అడుగడుగునా విచ్చుకున్న పచ్చదనం.. గాలి మోసుకొచ్చే సుగంధం.. కాలుష్యం అంటని శ్రేష్ఠమైన వాతావరణం.. ఇలా సహజత్వం ఉట్టిపడేలా అల్లుకుపోయిన నేచర్ పార్క్ మండలంలోని బాలాజీనగర్ శివారులో కోరగుట్ట చుట్టూ అటవీశాఖ ఆధ్వర్యంలో రూపుదిద్దుకుంది. దీని నిర్మాణం కోసం అటవీశాఖ సుమారు రూ.కోటి వరకు ఖర్చు చేసింది. కానీ కీలకమైన సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో ఇక్కడ అహ్లాదం అసంపూర్ణంగా మిగిలిపోయింది.

అటవీ వాతావరణం మరిపించేలా..

అడవిని మరిపించేలా అటవీశాఖ ఆధ్వర్యంలో మండలంలోని కోరగుట్ట వద్ద నేచర్ పార్క్‌ను తీర్చిదిద్దారు. నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన పనులు ఇటీవలే పూర్తయ్యాయి. ఎన్నో ప్రత్యేకతలు కలిగిన ఈ పార్క్‌లో కలియతిరిగేలా విశాలంగా రహదారులు నిర్మించి.. పక్కకు విభిన్న రకాల పూలమొక్కలు, సహజంగా అడవుల్లో కనిపించే విభిన్న జాతుల మొక్కలను నాటారు. అక్కడక్కడ విడిది కోసం అటవీ ఉత్పత్తులతో చిన్నపాటి నిర్మాణాలు చేపట్టారు. నీటి కోసం చిన్నపాటి చెరువులు, చెక్‌డ్యాంలను నిర్మించారు. వాకింగ్ ట్రాక్స్, చిన్నారులు మొదలు పెద్దల వరకు ఉదయం, సాయంత్రం వ్యాయామం చేసుకునేలా ఓపెన్ ఎయిర్ జిమ్ ఏర్పాటు చేశారు. పార్క్ మధ్యలో ఎత్తయిన కొండ.. మధ్యలో పట్టణంతోపాటు పరిసర ప్రాంతాలను వీక్షించేలా వాచ్ టవర్ ఇక్కడి ప్రత్యేకత. కొండగొర్రె, అడవి పందులు, అడవిజాలుగ, ముళ్లపంది, కుందేళ్లు, కొండపాము, ఉడుము వంటి అనేక వన్యప్రాణులు నేచర్‌పార్క్‌లో కనిపిస్తున్నాయి.

రాయితీలతో ప్రవేశ రుసుం

ప్రకృతి అనుభూతిని పొందేలా రూపుదిద్దుకున్న నేచర్ పార్క్ నిర్వహణ, భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేసే లక్ష్యంతో అటవీశాఖ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంది. పార్క్‌లో ప్రవేశం కోసం ఒక ధర నిర్ణయించింది. ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రత్యేక రాయితీలూ కల్పించింది. పార్క్ వీక్షణ కోసం పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10 సాధారణ రుసుంగా నిర్ణయించారు. వాకర్స్ కోసం ఏడాదికి రూ.వెయ్యి, సైక్లింగ్ కోసం గంటకు రూ.20, పిక్నిక్ ప్రభుత్వ సంస్థలకైతే రోజుకు రూ.200, ప్రైవేట్ సంస్థలకు, సాధారణ ప్రజలకు రూ.వెయ్యి, కార్తీక వనసమారాధనకు రూ.5 వేలు, కెమెరా షూటింగ్‌కు రూ.వెయ్యి, బస్సు, వ్యాన్‌లో పార్క్ అందాలను వీక్షించేందుకు రూ.100, టూ వీలర్ పార్కింగ్‌కు రూ.10, ఫోర్‌వీలర్ పార్కింగ్‌కు రూ.50 చొప్పున ధరలు నిర్ణయించారు.

అసౌకర్యాలే అసలు సమస్య

సహజసిద్ధమైన అందాలతో రూపుదిద్దుకున్న నేచర్ పార్క్‌లో అందాలపై అటవీశాఖ ఇప్పటివరకు ఎలాంటి ప్రచారం చేపట్టలేదు. సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించినప్పటికీ తాగునీటి సౌకర్యం లేదు. పార్క్ నిర్వాహకులే తాగునీటిని బయటి నుంచి తెచ్చుకుంటారు. వాచ్‌టవర్ మార్గం వర్షం వస్తే బురదమయంగా మారుతోంది. సందర్శకులు సమూహంగా విడిది చేసేలా ఒక్క నిర్మాణం లేదు. పార్క్‌లోని రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వాహనాల పార్కింగ్‌కు ఎలాంటి షెడ్లు లేవు.

నిధుల మంజూరుకు ప్రతిపాదించాం



కోరగుట్ట చుట్టూ సహజత్వం ఉట్టిపడేలా నేచర్‌పార్క్ నిర్మించాం. పార్క్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చేందుకు మరికొన్ని పనులు చేపట్టాల్సి ఉంది. ఆయా అంశాలను ఉన్నతాధికారులకు వివరించి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాం.

–ప్రసాద్, ఎఫ్ఆర్ఓ, ఇల్లెందు రేంజ్

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన



కొత్తగూడెంఅర్బన్: వినతిపత్రం ఇస్తున్న సీతాలక్ష్మి



ఇల్లెందు: వినతిపత్రం అందజేస్తున్న రాజేందర్

ఇల్లెందు/పాల్వంచరూరల్/టేకులపల్లి/చుంచుపల్లి/కొత్తగూడెంఅర్బన్: సీతారామ ప్రాజెక్టు జలాలు భద్రాద్రి జిల్లా రైతాంగానికి అందించాలని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇల్లెందు, పాల్వంచ, టేకులపల్లిలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ప్రవహిస్తున్న గోదావరి జలాలను జిల్లా రైతాంగానికి ఉపయోగపడేలా రీ డిజైన్ చేయాలని, బీఆర్ఎస్ హయాంలో 90 శాతం ప్రాజెక్ట్ పూర్తి కాగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయని, జిల్లాకు అన్యాయం చేసేలా ముగ్గురు మంత్రులు గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు తరలించుకుపోతున్నారని విమర్శించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఇల్లెందులో దిండిగాల రాజేందర్, శీలం రమేష్, సిలివేరు సత్యనారాయణ, లకావత్ దేవీలాల్‌నాయక్, మూడు కృష్ణప్రసాద్, జబ్బార్, ఖమ్మంపాటి రేణుక, అజ్మీరా భావ్‌సింగ్ నాయక్, పాల్వంచలో కాంపెల్లి కనకేశ్, పటేల్, రాజుగౌడ్, జూపల్లి దుర్గాప్రసాద్, రంజిత్, కిరణ్, హర్షవర్ధన్, సింధు, రవి, ప్రసాద్, టేకులపల్లిలో లక్కినేని సురేందర్‌రావు, బొమ్మెర వరప్రసాద్‌గౌడ్, కిషన్నాయక్, పూల్‌సింగ్, రాజా, సత్యనారాయణ, జయరాజు, లక్ష్మి, రాజు, చుంచుపల్లిలో బాదావత్ శాంతి, ఎస్.అనుదీప్, పవన్‌నాయక్ ప్రతాప్, రాజేశ్, బొమ్మిడి శ్రీకాంత్, ముత్యాల రాజేశ్, సదా మోహన్, మూడు జయరాం, మందుల జయరాజ్, తేలిక శివ, కనుకుంట్ల రవి, కొత్తగూడెంలో సీతాలక్ష్మి, ప్రసాద్, తొగరు రాజశేఖర్, హుస్సేన్, జయరాం, సాగర్, ఖాజా, మధు, పూర్ణచందర్ పాల్గొన్నారు.

ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐయూకేఎస్ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/సింగరేణి(కొత్తగూడెం): రైతాంగానికి అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సబ్సిడీపై వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బుర్రా వెంకన్న అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రైతు పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం గ్యారెంటీ చట్టం చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ రామకృష్ణ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు కల్లూరి కిశోర్, బానోత్ ధర్మా, మాచర్ల సత్యం, ఈసం శంకర్, పందూరి వీరబాబు, నాగేశ్వరరావు, బైరు వెంకన్న, నరేశ్, గాంధీ, వెంకటేశ్వర్లు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని చేర్చకపోవడం శోచనీయం



మాట్లాడుతున్న సోయం సత్యనారాయణ

పాల్వంచ/పాల్వంచరూరల్: మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్లలో కుంటినాగులగూడెం గ్రామాన్ని చేర్చకపోవడం శోచనీయమని ఆదివాసీ రాష్ట్ర నాయకులు సోయం సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక కొమరంభీం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 9వ వార్డులో 1950 నుంచి నేటి వరకు గెజిట్‌లో ఉన్న గ్రామమైన కుంటినాగులగూడెం.. డివిజన్లలో లేకపోవడం సరికాదని, గ్రామం పేరుని చేర్చేందుకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆరెం ప్రశాంత్, తురసం దశరాజు, తాటి శేషు, తురసం గంగరాజు, తురసం రాజారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.



చుంచుపల్లి: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అస్పష్టంగా విభజన

చుంచుపల్లి: నూతనంగా ఏర్పాటుకానున్న కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్ల విభజన తీరు అస్పష్టంగా ఉందని శాస్త్రీయ పద్ధతిని పాటించకుండా పూర్తిగా ఏకపక్షంగా ఏర్పాటు చేశారని ఆరోపిస్తూ సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఏఓకు పలువురు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. డివిజన్ల విభజన అంశాన్ని ముందుగా అఖిలపక్ష పార్టీలకు తెలపాలని, తర్వాత కలెక్టర్ అధ్యక్షతన పార్టీలకు ప్రజలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో శీలం విద్యాసాగర్, గుంపుల మహేష్, కృష్ణారెడ్డి, జీవీకే శివ, గొడుగు శ్రీధర్, బానోత్ రాంబాబు, కనకం నవీన్, కొదురుపాక జ్యోతి, ప్రకాష్ పాల్గొన్నారు.

సీఐ శివప్రసాద్‌కు అభినందన

కొత్తగూడెంఅర్బన్: జూన్ 2వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంటరీ అవార్డును అందుకున్న కొత్తగూడెం త్రీటౌన్ సీఐ శివప్రసాద్‌ను సోమవారం ఎస్పీ రోహిత్‌రాజు అభినందించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించినందుకు గాను శివప్రసాద్‌కు ఈ అవార్డు వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ రెహమాన్ పాల్గొన్నారు.



సీఐ శివప్రసాద్‌ను అభినందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు, పక్కన డీఎస్పీ రెహమాన్

అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం

నిత్యం ప్రజలు, రైతులు రాకపోకలు సాగించే రహదారి పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ విరిగి తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. మండలంలోని జగన్నాథపురం నుంచి నాగారం వైపు వెళ్లే రహదారి పక్కన ఓ రైతు కోళ్లఫారం కోసం ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం విరిగి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె పాక్షికంగా కూలి విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. ఎవరికైనా తీగలు తగిలితే ప్రమాదానికి గురి కావాల్సిందే.

-పాల్వంచరూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : రవీందర్
(విద్యుత్ శాఖ రూరల్ ఏఈ)
సెల్ నంబర్ : 94408 11564

836 ఇందిరమ్మ ఇళ్లకు కలెక్టర్ ఆమోదం

టేకులపల్లి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ ప్రక్రియ మొదలైంది. మండలంలోని పైలట్ ప్రాజెక్టు కోయగూడెం జీపీకి 230 ఇళ్లు కేటాయించగా 194 ఇళ్లకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. మిగిలిన 35 పంచాయతీలకు 673 కేటాయించగా 647 ఇళ్లను అధికారులు ఆన్‌లైన్ చేయగా 642 ఇళ్లకు కలెక్టర్ అప్రూవల్ ఇచ్చారు. మొత్తంగా 836 ఇళ్లకు ఆమోద ముద్ర పడినట్లయింది. మండలంలో 36 పంచాయతీలు ఉండగా ఒకటి పైలట్ ప్రాజెక్టు కింద పోగా మిగిలిన 35 జీపీల్లో లబ్ధిదారుల సంఖ్య, జనాభా ప్రాతిపదికన ఇంటి స్థలం ఉండి, ఇంటి పైకప్పు రేకులు లేదా గడ్డి, చుట్టు గోడలు రేకులు, కర్రలతో నిర్మించుకున్న నిరుపేదలకు ఒక్కో జీపీకి 14 – 25 వరకు ఇళ్లను మంజూరు చేశారు. కాగా, మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రొసీడింగ్ పత్రాలను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పంపిణీ చేయనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇల్లెందురూరల్: మండలంలోని చల్లసముద్రం, లచ్చగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ కోటేశ్వరరావు తెలిపారు. 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు.

బిర్సా ముండాకు నివాళి

ఇల్లెందు: గిరిజనుల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసి బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ఆదివాసీ జాతిని చైతన్య పర్చిన బిర్సా ముండా త్యాగం మరువలేనిదని సీపీఎం జిల్లా నాయకుడు నబీ, మండల కార్యదర్శి కిరణ్ అన్నారు. సోమవారం బిర్సా ముండా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కృష్ణ, మోహన్‌రావు, పద్మ, యాకూబ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

జూలూరుపాడు: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ సోమవారం ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జూలూరుపాడు, భేతాళపాడు, పాపకొల్లు, కాకర్ల, పడమటనర్సాపురం, కొమ్ముగూడెం, వినోభానగర్, సూరారం, అనంతారం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు లక్ష్మీనర్సయ్య, ఎస్కే మీరాసాహెబ్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, గురుమూర్తి, శాంతకుమారి, కృష్ణ, రాంబాబు, రంగమ్మ, నేతాజీ, స్వరూప, సునీత తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సరఫరా చేయాలి..



వినతిపత్రం అందజేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

టేకులపల్లి: సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు ఎట్టి నరసింహారావు, మండల నాయకులు గుగుతోతు రాంచందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐకేఎంఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. నకిలీ విత్తనాల బెడద నుంచి రైతులను రక్షించి, నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో డి.ప్రసాద్, కల్తీ వెంకటేశ్వర్లు, వెంకట్రామ్, రాజు సజన్, నర్సింగ్, ధారవత్ భీక్య, పడిత్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గడువు తేది పొడగించాలి..



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాల్వంచ: కొత్తగూడెం నగర పాలక సంస్థ ప్రకటించిన డివిజన్ల ప్రకటలపై సూచనలు, అభ్యంతరాల గడువు తేదీ పొడిగించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. సోమవారం పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ కార్యాలయంలో కమిషనర్ కె.సుజాతకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు, కాల్వ భాస్కర్, షేక్ సైదులు, భువన సుందర్‌రెడ్డి, కాపర్తి వెంకటాచారి, సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు మిల్లెట్ చిక్కీలు పంపిణీ

ఇల్లెందు: పట్టణంలోని కాకతీయనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు మిల్లెట్ చిక్కీలు పంపిణీ చేశారు. సోమవారం స్థానిక అంగన్‌వాడీ టీచర్ ఫాతిమా ఆధ్వర్యంలో అక్కడి కిశోర బాలికలకు ఎత్తు, బరువు కొలిచారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ ఫాతిమా మాట్లాడుతూ.. కిశోర బాలికలు ఈ మిల్లెట్లు తింటే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర పర్యవేక్షణాధికారి ధనలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగుకు వేళాయె

రోహిణీ కార్తె నుంచి రైతులు హలాలు పట్టుకుని పొలాలు దున్నే పనులకు సిద్ధం అవుతారు. జోడెడ్లు, ట్రాక్టర్లతో దుక్కి దున్ని నారుమడులు సిద్ధం చేసుకుంటారు. మరో వైపు పత్తి, మొక్కజొన్న విత్తనాలు వేస్తారు. సుజాతనగర్, జూలూరుపాడు మండలాల్లో వ్యవసాయ పనులు మొదలయ్యాయి. మృగశిరకార్తె రోజు భారీ వర్షం కురవడంతో రైతులు పొలాల బాట పట్టారు. ఈ ఏడాది ఎక్కువగా వాణిజ్య పంటలే పండించేందుకు రైతులు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వరి పంట కోసం దుక్కులు సిద్ధం చేస్తున్నారు.

-సుజాతనగర్, జూలూరుపాడు



సుజాతనగర్: ట్రాక్టర్‌తో దున్నుతూ..



సుజాతనగర్: విత్తనాలు వేస్తున్న మహిళలు



జూలూరుపాడు: అరకతో అచ్చు తోలుతున్న రైతు



జూలూరుపాడు: పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు